సింగిల్ పేజీ కథ

# సీతారామపురం జనం మహాగడుసోళ్లు

ఎ. రజాహుస్సేన్



కృష్ణానదికి ఆవలితీరంలో అదో చిన్న గ్రామం. పేరు సీతారామపురం. ఆ ఊరికి వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం లేదు. పడవలో కృష్ణ దాటితేగాని ఆ ఊరికి వెళ్లలేం. అందుకే ఆ ఊరు ఒంటరిగా మిగిలిపోయింది. ఆ ఊర్లో రెండే రెండు వీధులు. ఒకటి సీతయ్య గ్రూపుది. రెండోది రామయ్య గ్రూపుది. ఊర్లో రెండు గ్రూపులున్నా దేవాలయం మాత్రం ఒకటే వుంది. అది సీతారామస్వామి దేవాలయం. సీతయ్య, రామయ్య గ్రూపులు వేరైనా వారి రక్తం ఒక్కటే. అన్నదమ్ముల బిడ్డలు. దాయాదులు మధ్యవుండే సహజమైన పోరు వీరిద్దరి మధ్య కూడా వుంది. ఈ రెండు గ్రూపుల మధ్య నీళ్లు చల్లినా భగ్గున మండుతాయి.

సీతయ్య, రామయ్య తాతలు ఒకే తండ్రి బిడ్డలు. అప్పట్లో రెండు కుటుంబాల మధ్య సత్సంబంధాలుండేవి. శ్రీరామనవమి ఉత్సవాల్లో పానకం ఎవరు తయారుచేయించాలన్న విషయంలో ఏర్పడిన చిన్నగొడవ చివరకు కత్తులదాకా వెళ్లింది. తెల్లబెల్లంతో పానకం చేయాలని సీతయ్య తాత, కాదు నల్లబెల్లంతోనే పానకం చేయాలని రామయ్య తాత పట్టుబట్టారట. మాటా మాటా పెరిగి సీతయ్య తాత రామయ్య తాత చేయి నరికాడట. అప్పటినుంచి ఆ రెండు కుటుంబాలు బద్ధశత్రువుల్లా తయారయ్యాయి.

కాలం గడిచేకొద్దీ తరాలు మారేకొద్దీ ఈ తగాదాలు కూడా పెరుగుతూ వచ్చాయి. సీతయ్య తండ్రి, రామయ్య తండ్రికి మధ్య కూడా శ్రీరామనవమి రోజునే తిరిగి అటువంటి గొడవే వచ్చింది. ఇద్దరూ పంతాలకుపోయారు. ఈసారి రామయ్య తండ్రి సీతయ్య తండ్రి చేయి నరికేశాడు. చేయికి చేయి సరిపోయింది. ఇక గొడవలు మానుకొమ్మని ఊర్లో జనం ఎంత చెప్పినా సీతయ్య, రామయ్య ససేమిరా ఒప్పుకోలేదు. ఈ రెండు కుటుంబాల మధ్య తగాదాలు ఆ గ్రామం అభివృద్ధికి అవరోధంగా తయారయ్యాయి.

మళ్లీ శ్రీరామనవమి వచ్చింది. తెల్లారితే సీతారాముల కళ్యాణం. గుడిదగ్గర తాటాకులు పందిళ్లు వేశారు. పానకం కోసం రెండు మట్టిబానలు ఏర్పాటుచేసి నీళ్లు నింపారు. ఆనవాయితీ ప్రకారం ఊరి కామందులతో సీతారాముల పెళ్లి జరిపించి, పానకం ప్రసాదంగా పోయాలి. తెల్లారితే ఏమవుతుందోనని ఊరి జనానికి నిద్రపట్టలేదు. ఈసారి చేయి తెగుతుందో? లేక తలే ఎగిరిపోతుందో అని అందరూ ఆందోళన పడుతుండగానే భళ్లున తెల్లారింది. ఈసారి పానకం వంతు తమదని సీతయ్య వాదించాడు. కాదు మా కుటుంబమే పానకం తయారుచేయాలని రామయ్య మడతపేచీ పెట్టాడు. కామందుల పక్కనేవున్న పాలేరుగాళ్లు కత్తులు నూరుతున్నారు.

కళ్యాణానికి ముహూర్తం దగ్గర పడుతోంది. పానకం గొడవ వల్ల ముహూర్తం దాటిపోతోంది. ఏంచేయాలో జనానికి పాలుపోవటం లేదు. ఇంతలో అంజి అనే పిల్లాడు తన చేతిలో వున్న బెల్లాన్ని కుండలో వేశాడు. ఇది చూసిన జనం బుర్రలో ఐడియా తళుక్కున మెరిసింది. ఎవరికి వాళ్లు ఇళ్లకు వెళ్లి చేతినిండా బెల్లాన్ని తెచ్చి కుండల్లో వేశారు. కొంతమంది తులసి ఆకులు, మరికొంతమంది మిరియాలపొడిని తెచ్చివేశారు. ఇంకేముంది పానకం రెడీ...

మళ్లీ శ్రీరామనవమి వచ్చింది. తెల్లారితే సీతారాముల కళ్యాణం. గుడిదగ్గర తాటాకులు పందిళ్లు వేశారు. పానకం కోసం రెండు మట్టిబానలు ఏర్పాటుచేసి నీళ్లు నింపారు. ఆనవాయితీ ప్రకారం ఊరి కామందులతో సీతారాముల పెళ్లి జరిపించి, పానకం ప్రసాదంగా పోయాలి. తెల్లారితే ఏమవుతుందోనని ఊరి జనానికి నిద్రపట్టలేదు.

సీతయ్య, రామయ్యకు ఇదేం అర్థంకాలేదు. జనం మీద మన పట్టు పోయిందా? లేక జనమే మనల్ని పక్కన పెడుతున్నారా. అన్న అనుమానం నుంచి తేరుకోకముందే పందిట్లో మాంగల్యం తంతునేనా... అంటూ సీతారాముల కళ్యాణ మంత్రాలు వినిపించాయి. ఊరిజనం గ్లాసుల్లో పానకాన్ని పోసి రామయ్య,సీతయ్యకు అందించారు. ఆ రోజు పచ్చటి పందిట్లో నోరు తీపి చేసుకున్న రామయ్య,సీతయ్య మరెప్పుడూ గొడవపడలేదు. ఇద్దరూ అన్నదమ్ముల్లా మెలగటం మొదలెట్టారు.

ఇప్పుడా ఊరిలో పచ్చని పొలాలు పదహారేళ్ల పడుచుల్లా నవనవలాడుతూ కనిపిస్తున్నాయి. పొలాలగట్ల మీద కాలిన పంటకుప్పలకు బదులు కొబ్బరి మొక్కలు తల ఎత్తుకొని నిలబడ్డాయి. ఆ మధ్య సీతయ్య, రామయ్య ఇద్దరూ కలిసి ఎమ్మెల్యేదగ్గరకు వెళ్లి అడిగి మరీ ఊరికి రోడ్డేయించుకున్నారు. దీంతో ఆ ఊరికి పడవ బాధ తప్పింది. స్టార్ టీవీ కనెక్షన్లు కూడా రావడంతో కుర్రకారు రకరకాల ఫ్యాషన్ డ్రెస్సులు కుట్టించుకున్నారు. ఊరికి కొత్తగా జూనియర్ కాలేజ్ వచ్చింది. ఆస్పత్రి, కమ్యూనిటీహాల్ శాంక్షన్ అయింది. పోయిన శ్రీరామనవమికి ఏ గొడవా జరక్కపోవడంవల్లే ఆ సీతారాములు తమ ఊరిపై దయ చూపారని జనం అనుకున్నారు. చేతులు నరుక్కునేకంటే చేతులు కలిపితేనే బాగుందని సీతయ్య, రామయ్య ఒక అవగాహనకు వచ్చారు. ఆ తర్వాత నుంచి శ్రీరామనవమిపండగకు ఆ ఇద్దరి ఆధ్వర్యంలో ఊరుఊరంతా కలిసి పానకం తయారుచేసుకునేవారు. ఈ సంబరాన్ని చూడటానికి పక్క ఊళ్ల జనం ఎడ్లబండ్లు కట్టుకొని వచ్చేవాళ్లు. అక్కడ జరిగే సంబరాన్ని చూసి జనం ముక్కుమీద వేలేసుకునేవారు. ఎంతైనా సీతారామపురం జనం మహాగడుసోళ్లు అంటూ లోపల్లోపలే అసూయ పడేవాళ్లు.